క్లుప్తంగా

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సిములు మాదిగ



సంగెంకలాన్‌లో ఫించన్ దారులతో నర్సిములు మాదిగ

తాండూరు రూరల్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జినుగుర్తి నర్సిములు మాదిగ అన్నారు. మంగళవారం మండలంలోని సంగెంకలాన్‌లో ఫించన్‌దారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వృద్ధులు, వితంతువులకు నెలకు రూ.2వేల ఫించన్ నుంచి రూ.4 వేలకు, దివ్యాంగులకు రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంచుతామని ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నెల 9వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాధర్నాకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శేఖర్, రవి, లక్ష్మీ, అంతప్ప, హన్మంతు, మొగులమ్మ, సుశీలమ్మ, తుల్జమ్మ, బాబు పేర్కొన్నారు.

ఓటరు తుది జాబితా విడుదల



ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ ఉషశ్రీ

కొడంగల్ రూరల్: మండలంలో వార్డుల వారీగా ఓటరు తుది జాబితాను ఎంపీడీఓ ఉషశ్రీ మంగళవారం విడుదల చేశారు. గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయం, మండల ప్రజా పరిషత్ కార్యాలయ నోటీస్ బోర్డుపై ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. మండలంలోని 25 గ్రామాల్లో మొత్తం 222 వార్డులున్నాయని, మొత్తం 32,205 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ



గోపూజ చేస్తున్న భక్తులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని శివాజీనగర్‌లో మాతాబాల భక్త సమాజం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయక మండపం వద్ద మంగళవారం గోపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

రైతుబజారులో వసతుల కల్పనకు కృషి

చైర్మన్ పెంటయ్యగౌడ్



రైతు బజారులో చిరువ్యాపారులతో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ సభ్యులు

చేవెళ్ల: అందుబాటులోకి వచ్చిన రైతుబజారులో మౌలిక వసతుల కల్పనకు మార్కెట్ కమిటీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ బి.రాములు, పాలకవర్గం సభ్యులు అన్నారు. చేవెళ్లలోని రైతుబజారులో మంగళవారం కూరగాయల అమ్మకాలు చేస్తున్న చిరువ్యాపారులతో మాట్లాడి అక్కడ సమస్యలు తెలుసుకున్నారు. వ్యాపారులు షెడ్‌లలో గతంలో ఏర్పాటు చేసిన లైట్లు, వసతులు అన్ని పాడవడంతో మళ్లీ కొత్తగా ఏర్పాటు చేయాలని కోరారు. వెంటనే మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు తమసొంత నిధులతో లైట్లు, తాగునీటి వసతికి కావాల్సిన నల్లాలను ఏర్పాటు చేయించారు. బాత్‌రూమ్‌లు కూడా ఉపయోగించుకునే విధంగా నీటి వసతిని ఏర్పాటు చేసి ఆవరణ మొత్తం శుభ్రం చేసే పనులు చేపట్టారు. వ్యాపారులు ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని వ్యాపారులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి మహేందర్, పాలకవర్గ సభ్యులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు పలువురి శుభాకాంక్షలు

మొయినాబాద్: చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మొయినాబాద్‌లోని తన నివాసంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య రత్నం వేడుకలు జరుపుకొన్నారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజభూపాల్‌గౌడ్, రాష్ట్ర నాయకులు అంజన్ కుమార్‌గౌడ్, సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా నాయకులు గోపాల్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, వెంకటేశ్‌గౌడ్, క్యామ పద్మనాభం తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

పత్తి తెగుళ్లతో భద్రం!



అలేడ్‌లో పెరిగిన పత్తిపంట



రసం పీల్చు పురుగు

- రసం పీల్చే పురుగులతో జాగ్రత్త
- తెల్ల, పచ్చ దోమలు ఆశించే అవకాశం
- రైతులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దు
- నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారుల సూచన

దుద్యాల్: కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల పత్తి పంటకు రకరకాల పురుగులు సోకొచ్చు. తెల్ల, పచ్చ దోమలు ఆశించి ఆకులను నాశనం చేస్తాయి. ఈ విషయంలో రైతులు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారులు వివరిస్తున్నారు. ప్రస్తుతం పత్తి పంట పూత దశ నుంచి కాయ దశకు చేరింది. ప్రారంభంలో సాధారణ వర్షపాతం వల్ల పత్తి మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో పూత అధికంగా వచ్చి కాయలు కూడా పెరిగాయి. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలతో పత్తిని ఆశించే వివిధ రకాల చీడ, పీడలతో పాటు రసం పీల్చే పురుగులు విజృంభిస్తాయి. కాబట్టి తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటాయని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు.

పచ్చ దోమ

సాధారణంగా ఉష్ణోగ్రత, వర్షాపాతం, మబ్బులతో వాతావరణ పరిస్థితులు మారడం వల్ల పురుగు ఉధృతి పెరిగే అవకాశం ఉంటుంది. తల్లి, పిల్ల పురుగులు ఆకుల మీద అడ్డంగా నడుస్తూ ఆకు అడుగు భాగానికి చేరి రసాన్ని పీల్చుకుంటాయి. ఈ పురుగు ఆశిస్తే మొక్క యొక్క ఆకు ముడుచుకుని లేత పసుపు రంగులోకి మారి నెమ్మదిగా ఎరుపు రంగులోకి చేరుతుంది. తద్వారా ఆకులు పూర్తిగా రాలిపోతాయి. దీంతో మొక్క ఎదుగుదల ఆగిపోతుంది.

పేనుబంక పురుగు

బెట్ట వాతావరణం, వానాకాలంలో ఉధృతి తక్కువగా ఉంటుంది. వర్షాలకు బెట్టకాలానికి మధ్య ఈ పురుగు ఎక్కువగా ఆశిస్తుంది. తల్లి, పిల్ల పురుగులు మొక్క లేత కొమ్మలు, ఆకుల అడుగు భాగాల నుంచి రసాన్ని పీల్చుకుంటాయి. దీని వల్ల మొక్క ఎదుగుదల ఆగిపోతుంది. పేనుబంక పురుగు వల్ల తేనె వంటి జిగురు పదార్థాన్ని స్రవిస్తాయి. దీంతో ఆకులపై నల్లని బూజు ఏర్పడి సూర్యరశ్మిని స్వీకరించకపోవడంతో కిరణజన్య ప్రక్రియ జరగకపోవడంతో మొక్కలో ఎదుగుదల ఉండదు.

తామర, తెల్ల దోమ

వర్షాలు తక్కువ ఉండి, ఉష్ణోగ్రతలు ఎక్కువ ఉంటే దీని ఉధృతి ఎక్కువగా ఉంటుంది. ఈ పురుగులు ఆకు అడుగునా చేరి ధారాళంగా రసాన్ని పీల్చుకుంటాయి. దీని వల్ల ఆకులు ముడుచుకుని పెలుచగా మారుతాయి. తల మాడు వ్యాధి తామర పురుగు వల్ల వ్యాప్తి చెందుతాయని శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు.

ఎర్రనల్లి

బెట్ట పరిస్థితుల్లో, పిందె, కాయ దశలో ఉన్నప్పుడు దీని ఉధృతి అధికంగా ఉండే అవకాశం ఉంది. తల్లి, పిల్ల పురుగులు ఆకుల అడుగు భాగాన చేరిన సాలీడు గూడులాగా అల్లుకుని రసాన్ని పీల్చుకుంటాయి. దీని వల్ల ఆకుల మధ్య పసుపు రంగుగా మారి ఆకు మొత్తం ఎరుపు రంగుకు చేరుకుంటుంది. అనంతరం ఆకులు రాలి ఎండిపోతాయి. కాబట్టి పంటను కాపాడుకోవడానికి రైతులు నిర్లక్ష్యంగా ఉండొద్దని వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే పంట నష్టం తగ్గించుకోవచ్చని చెబుతున్నారు.

పిచికారీ చేయించుకోవాలి



వర్షాల కారణంగా పత్తి పంటకు పలు రకాల తెగుళ్లు సోకే అవకాశం ఉంది. పంటలోని మొక్కలను పరిశీలించి గ్రామాల్లోని సిబ్బంది, ఏఈఓల సూచనల ద్వారా చీడపీడ నివారణ మందులను పిచికారీ చేయించుకోవాలి. వ్యవసాయ అధికారుల సలహాలు పాటించకుండా ఇష్టానుసారంగా మందులు వాడితే నష్టం జరిగే అవకాశం ఉంది. ఈ విషయంలో రైతులు నిర్లక్ష్యంగా ఉండొద్దు.

– నాగరాజు, వ్యవసాయ అధికారి, దుద్యాల్

'ప్రజా సమస్యలపై నిలదీస్తాం'



కేరెళ్లిలో బీజేపీ ప్రవాస్ యోజన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ధారూరు: మండల పరిధిలోని కేరెళ్లిలో మంగళవారం బీజేపీ ప్రవాస్ యోజన కార్యక్రమాన్ని నిర్వహించింది. గ్రామంలోని పార్టీ నాయకులు, కుల, మహిళా సంఘాలు, యువకులతో సమావేశమై కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. 24 గంటల పాటు గ్రామంలోనే ఉంటూ ప్రజా సమస్యలను సేకరించి, రాత్రి కార్యకర్తల ఇంట్లోనే బసచేయనున్నట్లు బీజేపీ నాయకులు వెల్లడించారు. సేకరించిన ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాజునాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు వివేకానందరెడ్డి, జిల్లా అధికారి ప్రతినిధి రాజేందర్‌గౌడ్, జెడ్పీటీసీ ఎన్నికల మండల ఇన్‌చార్జి వెంకటయ్య, నాయకులు పాండుగౌడ్, ఎం.రమేశ్, గోపాల్‌రెడ్డి, శివరాం, రమేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



బొంరాస్‌పేట: మెట్లకుంటలో వినాయక నిమజ్జన ఊరేగింపులో నాయకులు



దుద్యాల్: హస్నాబాద్‌లో దాండియా ఆడుతున్న మహిళలు

కొనసాగుతున్న పూజలు

గణేశ్ నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. నియోజకవర్గాల్లోని వాడవాడల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద మంగళవారం ప్రత్యేక పూజలతో పాటు అన్నాదానం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకీయనాయకులు, అధికారులు పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తిభావంతో మెలిగి పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచించారు.

సంబంధిత ధ్రువపత్రాలు ఉండాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

మోమిన్‌పేట: వాహనాలు నడిపే సమయంలో సంబంధిత ధ్రువపత్రాలు దగ్గర ఉంచుకోవాలని పోలీసులు పేర్కొన్నారు. మంగళవారం మోమిన్‌పేటలో వాహనాల తనిఖీ నిర్వహించారు. అనంతరం రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించి నడపాలన్నారు. ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమ నిబంధనలు పాటించాలని సూచించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఊటుపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ అందజేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

దోమ: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఇందిరమ్మ కమిటీ గ్రామ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం దోమ మండల పరిధిలోని ఊటుపల్లిలో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అర్హులందరికీ ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు శ్రీనివాస్, గ్రామస్తులు గోపాల్, మహేశ్, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్

కుల్కచర్ల: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు చేరుతాయని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ పేర్కొన్నారు. మంగళవారం ఉమ్మడి అంతారంలో లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డుల ప్రొసీడింగ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పేదల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా నూతన రేషన్ కార్డులను మంజూరు చేసి పంపిణీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, నేతలు గోపాల్‌నాయక్, అంజిలయ్యగౌడ్, జలీల్, భరత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కుల్కచర్ల: రేషన్ కార్డుల ప్రొసీడింగ్ పంపిణీ చేస్తున్న భీంరెడ్డి, ఆంజనేయులు ముదిరాజ్ తదితరులు

పరిసరాల పరిశుభ్రత అవసరం

మెడికల్ ఆఫీసర్ కిరణ్‌గౌడ్

కుల్కచర్ల: సంక్షేమ వసతి గృహాల్లో, పాఠశాలల్లో తప్పనిసరిగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మెడికల్ ఆఫీసర్ కిరణ్‌గౌడ్ తెలిపారు. మంగళవారం రాంపూర్ గ్రామ పరిధిలోని గిరిజన బాలికల వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పరిసరాలు శుభ్రంగా లేకపోతే దోమలు, క్రిమికీటకాలు వ్యాపించి వ్యాధుల బారిన పడే అవకాశం ఎక్కువఅన్నారు. ముఖ్యంగా విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. భోజనం చేసే ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ సబితారాణి, తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి మృతి బాధాకరం

మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

దోమ: విశ్రాంత ఉపాధ్యాయుడు చుక్కన్నగారి భిచ్చిరెడ్డి మృతి బాధాకరమని పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం దోమ మండల కేంద్రంలో మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మయ్య ముదిరాజ్, మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి, నేతలు శ్రీనివాస్‌రెడ్డి, ఆశిరెడ్డి, రాంచంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

- అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు కనిపిస్తే సమాచారం ఇవ్వండి
- ఎస్‌ఐ యాదగిరి

దుద్యాల్: వారం రోజుల నుంచి పశువులను అపహరిస్తుండడంతో యజమానులు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ యాదగిరి పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..పశువులను దొంగిలించేందుకు గుర్తు తెలియని వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తున్నారని, అదునుచూసి తీసుకెళ్లే ప్రయత్నాలు చేస్తారన్నారు. మేకలు, జీవాలు, పశువు యజమానులు రాత్రి వేళల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా, కొత్తవ్యక్తులు, వాహనాలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం చేరవేయాలన్నారు.

శాంతియుతంగా ఉత్సవాలు జరుపుకోవాలి

కొందుర్గు: శాంతియుత వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలు జరుపుకోవాలని ఎస్‌ఐ రవీందర్‌నాయక్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని వినాయక మండపాలను ఆయన సందిర్శంచారు. డాగ్ స్క్వాడ్‌తో మండపాలు, ఆవరణను తనిఖీ చేయించారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు సైబరాబాద్ సీపీ అవినాశ్ మొహంతి ఆదేశాల మేరకు తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. నిమజ్జనం సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. డీజేలు వినియోగించొద్దన్నారు. చెరువులు, కుంటల లోపలికి వెళ్లి ప్రాణాలపైకి తెచ్చుకోవద్దని, ఇందుకు స్థానికులు, భక్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ బాలస్వామి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఆరోపణలు అర్థరహితం

కాంగ్రెస్ మండల నాయకులు

యాలాల: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆయన సోదరుడు శ్రీనివాస్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ నాయకులు చేసే ఆరోపణలు అర్థరహితమని మండల కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి చేసిన ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. తాండూరు అభివృద్ధికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చేస్తున్న కృషిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు తాగిన మైకంలో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే సోదరుడు ప్రజలకు సేవచేస్తుంటే చూసి ఓర్వలేకే బురద జల్లుతున్నారన్నారు. షాడో ఎమ్మెల్యేనని పేర్కొనడం బాధకరమన్నారు. యూరియా విక్రయాల్లో ఎలాంటి గందరగోళం లేదన్నారు. చెల్లించిన ధరకే పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, మాజీ అధ్యక్షుడు భీమప్ప, మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేశం, ఏఎంసీ డైరెక్టరు రాజు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు అమృతప్ప, నాయకులు హన్మంతు, మహిపాల్, చంద్రశేఖర్‌గౌడ్, వికాస్ జోషి పాల్గొన్నారు.

ప్రజా పాలనలో అందరూ సేవకులే

ప్రజా పాలనలో అందరూ సేవకులేనని, నియోజకవర్గ అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వాలే తప్పా చిల్లర మాటలు మానుకోవాలని కాంగ్రెస్ యువజన నాయకుడు వికాస్ జోషి హెచ్చరించారు.

కాంగ్రెస్‌తో గ్రామాల అభివృద్ధి

కొడంగల్ మండల అధ్యక్షుడు ప్రశాంత్



అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

దుద్యాల్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాల సంపూర్ణ అభివృద్ధి సాధ్యమని కొడంగల్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని హస్నాబాద్‌లో నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని గమనించి కడా ప్రత్యేక నిధుల నుంచి రూ. 20లక్షలు మంజూరు చేసిందన్నారు. దీంతో భవన నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి , అంగన్‌వాడీ హస్నాబాద్ క్లస్టర్ ప్రభా, గ్రామ అధ్యక్షుడు భీములు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధిని పట్టించుకోని ప్రభుత్వం

బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి



పెద్దమంగళారం-చందానగర్ రోడ్డుపై గుంతలో వరినాట్లు వేసి నిరసన తెలుపుతున్న నాయకులు

మొయినాబాద్: గ్రామీణ రోడ్ల అభివృద్ధిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. మున్సిపాలిటీలోని పెద్దమంగళారం-చందానగర్ రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో బీఆర్‌ఎస్ నాయకులు వరినాటు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే రోడ్ల అభివృద్ధి జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా రోడ్ల అభివృద్ధిని పట్టించుకోవడం లేదన్నారు. వర్షాల కారణంగా రోడ్లన్నీ గుంతలయమంగా మారి ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి వెంటనే పనులు మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రవుఫ్, మాజీ సర్పంచ్‌లు కోట్ల నరోత్తంరెడ్డి, నవీన్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

పంటల నమోదు తప్పనిసరి

నందిగామ: పంటల వివరాలను సంబంధిత ఏఈఓల వద్ద నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి రామశివరావు అన్నారు. నందిగామలో మంగళవారం మాట్లాడుతూ.. రైతులు తాము సాగు చేసే వివరాలను వ్యవసాయ శాఖ వద్ద నమోదు చేసుకున్నట్లయితే పంటలను విక్రయించే సమయంలో సులభతరంగా ఉంటుందన్నారు. అదేవిధంగా రాయితీపై పనిముట్లు కావాల్సిన వారు రైతువేదిక వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పట్టాదార్‌పాస్ పుస్తకం జిరాక్స్, ఆధార్‌కార్డు, ట్రాక్టర్ ఆర్సీ జిరాక్స్ జత చేయాలని సూచించారు.



తాండూరు రూరల్: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మహిపాల్‌రెడ్డి, తదితరులు

వైఎస్సార్ సేవలు మరువలేనివి



అనంతగిరి: నివాళులర్పిస్తున్న వైఎస్‌ఆర్ అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు



యాలాల: రాస్నంలో వైఎస్‌ఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని పలువురు కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. మంగళవారం వైఎస్సాఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. వికారాబాద్, తాండూరు, కొడంగల్, పరిగిలో ఆయన చిత్రపటానికి, విగ్రహానికి కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు సీనియర్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సీఎంగా అమలు చేసిన సంక్షేమ పథకాలను గుర్తు చేసుకున్నారు.



పరిగి: వైఎస్‌ఆర్ విగ్రహానికి నివాళి